క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


గంప వెంకటతరుణ్

పోరుమామిళ్ల: మండలంలోని వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి గంప వెంకటతరుణ్ ట్రిపుల్ జంప్‌లో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు రామకృష్ణయ్య తెలిపారు. ఈనెల 3, 4 తేదీల్లో శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో ట్రిపుల్ జంప్‌లో తరుణ్ ద్వితీయస్థానంలో వచ్చి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

కిశోరి బాలికలకు అవగాహన

పోరుమామిళ్ల: పట్టణంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో బుధవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ లక్ష్మీదేవి కిశోరి బాలికలకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికలు పోక్సో చట్టం, బాలికల హక్కులు, న్యాయ సంబంధ హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కౌమార దశలో ఉన్న అమ్మాయిలు తొందరపాటు నిర్ణయాలు తీసుకోరాదని, ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. గుడ్ టచ్...బ్యాడ్ టచ్‌లను వివరిస్తూ మంచి చెడులు గ్రహించాలన్నారు. ప్రతి అంశంపై అవగాహన ఉన్నపుడే బాలికలు ఉజ్వల భవిష్యత్తు అందుకుంటారన్నారు. సమస్యలు 1098 చైల్డ్ హెల్ప్ లైన్ ద్వారా తెలుపాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, పాఠశాల ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

డ్రైనేజీ కాలువ నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు: మండలంలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీకి సంబంధించి ఆర్టీసీ బస్టాండ్ వద్ద నుండి రిలయన్స్ పెట్రోలు బంకు వరకు డ్రైనేజి కాలువ నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి భూమి పూజ చేశారు. రూ.కోటి 25 లక్షల నిధులతో ఈ కాలువను నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బస్టాండ్ వద్ద నుండి రోడ్డును విస్తరించడంతోపాటు డివైడర్లను నిర్మిస్తామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చే కార్యక్రమం ప్రారంభమైందన్నారు. కార్యక్రమంలో కొత్తపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

భూతప్ప నారాయణస్వామి 25వ ఆరాధన ఉత్సవం


ఆరాధన సందర్భంగా జరుగుతున్న హరిభజన

పోరుమామిళ్ల: మండలంలోని రామేశ్వరంలో భూతప్ప నారాయణస్వామి ఆరాధన ఉత్సవాలు గత 24 సంవత్సరాలుగా ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం 25వ ఆరాధన ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. పూజారి నాగయ్యస్వామి ఆధ్వర్యంలో ఉదయం పూజాకార్యక్రమాలతో ఆరాధన ఉత్సవాలు మొదలయ్యాయి. 8 గంటల నుండి హరిభజన కొనసాగింది. సాయంత్రం కులుకు భజన, డీజే కోలాటం భక్తులను ఆకట్టుకున్నాయి. రాత్రికి వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర పూర్తి నాటక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఆరాధనకు వచ్చిన భక్తులకు గుంటూరు, ప్రకాశం, కడప జిల్లాలకు చెందిన దాతలు మజ్జిగ, అన్నదానం చేశారు.

ఉపాధి కల్పనలో ప్రభుత్వం విఫలం


ఆర్డీఓ కార్యాలయ ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

బద్వేలు అర్బన్: ప్రపంచంలో ఎక్కడా లేనంత యువశక్తి భారతదేశంలో ఉన్నప్పటికీ వారికి ఉపాధి కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్‌షరీఫ్, ఆదిల్‌లు పేర్కొన్నారు. రైల్వేశాఖలో రిటైర్డ్ ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం ఆర్డీఓ కార్యాలయ ఏఓకు డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023 జూన్ 1 నాటికి రైల్వేశాఖలో 2.61 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఇటీవల రైల్వేశాఖ మంత్రి అశ్వనీవైష్ణవ్ ప్రకటించారని, వాటిని భర్తీ చేయకుండా రిటైర్డ్ ఉద్యోగులను విధుల్లోకి తీసుకుంటున్నట్లు ప్రకటించడం నిరుద్యోగులను మోసగించడమే అన్నారు. తక్షణమే రిటైర్డ్ ఉద్యోగులను విధుల్లోకి తీసుకునే ఆలోచనను విరమించుకుని ఖాళీగా ఉన్న పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రూరల్ కార్యదర్శి బాలగురవయ్య, పట్టణ నాయకులు శివకుమార్ పాల్గొన్నారు.

శతాబ్దాల చరిత్రకు సాక్ష్యం పోరుమామిళ్ల చెరువు

- అధికారుల అలనాపాలనా లేక మూసుకు పోయిన కాలువలు
- నిధుల కొరతతో అభివృద్ధికి దూరం
- పంటకాలువల కబ్జా–పొలాలకు అందని సాగునీరు


పోరుమామిళ్ల చెరువు

పోరుమామిళ్ల: రాయలసీమలో అతిపెద్ద చెరువు పోరుమామిళ్ల చెరువు. దాదాపు 11 కిలో మీటర్ల పొడవు, మూడున్నర కిలోమీటర్ల వెడల్పుతో విశాలమైన ఈ చెరువు అలుగు పారితే 6 వేల ఎకరాలకు సాగు నీరు అందించగలదు. పట్టణానికి మైలు దూరంలో తూర్పున ఉన్న బోడికొండలను ఆసరా చేసుకొని 1367లో అప్పటి ఉదయగిరి పాలకుడు భాస్కరరాయలు చెరువు నిర్మించాడు. 4 తూములతో రెండు సంవత్సరాల్లో నిర్మాణం పూర్తి చేసి, పొలాలకు సాగు నీరు అందించాడు. పోరుమామిళ్ల చెరువులో నీరుంటే చుట్టూ 10 మైళ్ల భూగర్భజలాలు పుష్కలంగా ఉంటాయి. పోరుమామిళ్ల చెరువు నుండి మార్కాపురం, రెడ్డికొట్టాల, రంగసముద్రం చెరువులకు, రెడ్డికతవ, మల్లకతవలకు నీరు సరఫరా జరుగుతుంది. మొదటి తూము నుండి వచ్చే కాలువ రంగసముద్రం చెరువుకు నీరు అందిస్తుండగా, రెండవ తూము కాలువ మల్లకతవ, రెడ్డికతవ, రెడ్డికొట్టాల, రంగసముద్రం చెరువులకు నీరందిస్తుంది. నాలగవ తూము కాలువ మార్కాపురం చెరువుకు నీరు అందిస్తుంది.

అధికారుల నిర్లక్ష్యంతో మాయమవుతున్న కాలువలు

ఇటీవల పట్టణం బాగా పెరిగిపోవడం, రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరందుకోవడంతో ఆ ప్రభావం పంటకాలువలపై పడింది. మొదటి తూము నుండి వచ్చే ఒక కాలువ ఆర్టీసీ బస్టాండు మీదుగా రంగసముద్రం చెరువుకు, మరో కాలువ జూనియర్ కాలేజీ, తెలుగుగంగ విశ్రాంతి భవనం మీదుగా వెళుతుంది. ఈ రెండు కాలువల వెడల్పు అప్పట్లో 10 అడుగులు ఉండేవి. పట్టణం పెరగడం , బస్టాండు ఏర్పాటుతో చుట్టూ భవనాలు నిర్మించుకున్నవారు కాలువలను మూసివేసినారు. విశాలమైన కాలువలు రోడ్డు సైడ్ డ్రైనేజీలుగా మారిపోయి, ఇప్పుడు కనిపించకుండా పోయాయి. రెండు కాలువలు పూడ్చడంతో రంగసముద్రం చెరువుకు చుక్క నీరు వెళ్లడం లేదు. రంగసముద్రం రైతులంతా కర్నాటకలో కాంట్రాక్టు చేసుకుంటూ బాగా డబ్బు సంపాదించుకోవడంతో పొలాలు బీళ్ల పడ్డా పట్టించుకోవడం లేదు.

- ఇక మల్లకతవ మీదుగా రెడ్డికొట్టాల, రంగసముద్రం చెరువులకు వెళ్లే కాలువ 15 నుండి 20 అడుగుల వెడల్పు ఉన్నా, పట్టణంలోని చెత్తా చెదారం సంవత్సరాల తరబడి వేయడంతో అది మూసుకుపోయింది. కంపచెట్లు, గడ్డి పెరిగిపోయాయి. మరో కాలువ ఓఎల్ఎఫ్ ఆసుపత్రి, బెస్తవీధి మీదుగా పారేది. అది పూర్తిగా మాయమయింది. ఇటీవల జరిగిన మండల సమావేశంలో జడ్పీటీసీ, వైస్ ఎంపీపీ ఈ విషయంపై సీరియస్‌గా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. కాలువల కబ్జాలపై చర్య తీసుకోవాలని, ఎలాంటి ఒత్తిడులకు లోనుకాకుండా ఆక్రమణలు తొలగించి కాలువను పూర్వస్థితికి తేవాలని కోరారు. ఇదిలా ఉంటే పట్టణ శివారులో ఉన్న మల్లకతువ ప్రక్కనున్న చిన్న మల్లకతువ కనిపించడం లేదు. చిన్నమల్లకతువ నుండే రంగసముద్రం, రెడ్డికొట్టాల చెరువులకు నీరు వెళ్లేది. చిన్న మల్లకతువను కబ్జాదారులు పూడ్చి వేశారు. మల్లకతవ కింద, రెడ్డికొట్టాల, రంగసముద్రం చెరువుల కింద వేలాది ఎకరాలు బీడు పడింది. ఆ భూముల యజమానులు రియల్ ఎస్టేట్ కింద అమ్ముకుంటే కోట్లు దండుకోవచ్చనే ఆలోచనతో పంట సాగు, పంట కాలువల గురించి ఆలోచించడం లేదు. పోరుమామిళ్ల చెరువు కింద ఆరు వేల ఎకరాల్లో ఈనాడు 3 వేల ఎకరాలే సాగులో ఉందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. 7 వందల సంవత్సరాల క్రితం చెరువుకు ఏర్పాటు చేసిన తూములు అప్పుడప్పుడు కొద్దిపాటి మరమ్మతుతో సరిపెట్టడం తప్పితే ఇరిగేషన్‌శాఖ అధికారులు పట్టించుకోవడం మానివేశారు. తెలుగుగంగ రిజర్వాయర్‌గా మార్చడంతో ఇరిగేషన్ అధికారులు చెరువు అలనాపాలనా తెలుగుగంగ అధికారులదే అంటున్నారు. తెలుగుగంగ అధికారులు చెరువు అభివృద్ధిపై దృష్టి సారించడం లేదు.


చిన్నమల్లకతువ కనిపించకుండా పెరిగిన కంపచెట్లు, పొదలు

తూములను బాగు చేయాలి



ఎంతో చరిత్ర కలిగిన పోరుమామిళ్ల చెరువు అభివృద్ధిపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కట్టపై కంపచెట్లు తొలగించడం లేదు. తూములు బాగు చేయడం లేదు. రైతులు నీటి లీకేజీ అడ్డుకునేందుకు తూములో రాల్లు, గడ్డి వేస్తున్నారు. తూములు బాగు చేస్తే నీరు వృధా కాదు. – మస్తాన్, రామాయపల్లె

కబ్జాదారులపై చర్య తీసుకోండి



ఆర్టీసీ బస్టాండు నుండి పంటకాలువ కబ్జా చేశారు. వెంకటేశ్వర కళాశాల వెనుక కాలువ పూడ్చి ప్లాట్లు వేశారు. నాగేంద్రరెడ్డి అనే వ్యక్తి కాలువను కనిపించకుండా చేశాడు. ఇందువల్ల రంగసముద్రం చెరువుకు నీరు పోవడం లేదు. అధికారులు తూము దగ్గర్నుండి కాలువను బాగు చేయాలి. కబ్జాదారులపై క్రిమినల్ కేసులు పెట్టాలి. – వీరపోగు రవి, విద్యార్థి నాయకుడు.


రంగసముద్రం, రెడ్డికొట్టాల చెరువులకు వెళ్లే కాలువలో పెరిగిన పొదలు

అక్రమ కేసులతో వేధించడం రాజ్యాంగ ఉల్లంఘనే


మాట్లాడుతున్న రెడ్యం వెంకటసుబ్బారెడ్డి

చాపాడు: వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తల్ని అక్రమ కేసులతో వేధించడం రాజ్యాంగ ఉల్లంఘనే అని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలు బట్టబయలవుతాయని భావించిన చంద్రబాబు సర్కార్ కేవలం 3 రోజుల్లో వందకు పైగా సోషల్ మీడియా కార్యకర్తలన్ని అరెస్ట్ చేయించడం వారి నీచ రాజకీయానికి నిదర్శనమని అభివర్ణించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, సోషల్ మీడియా శ్రేణులను వేధించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తోందని తెలియజేశారు. భావ ప్రకటన స్వేచ్ఛను అణచివేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని, వారి ఆదేశాలకు అనుగుణంగా పోలీసులు నడుచుకుంటారని ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ నాయకత్వంలో ఏ ఒక్కరూ భయపడాల్సిన అవసరం లేదని, కోర్టుల ద్వారా, ప్రజా ఉద్యమాల ద్వారా వారి దౌర్జన్యాలను ఎదుర్కొందామని పిలుపునిచ్చారు. ఇచ్చిన హామీలు అమలు చేయమనే హక్కు రాష్ట్రంలో ప్రతి ఒక్కరిపై ఉందని, ప్రభుత్వంపై విమర్శలు చేసేవారిని అణచివేయాలనే ఆలోచన చేయడమే సుప్రీం ఆదేశాలను తుంగలోకి తొక్కేయడమేనని అన్నారు. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలను అక్రమ అరెస్టులపై ఉన్న శ్రద్ధ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఫసల్ బీమా ప్రీమియంను ప్రభుత్వమే చెల్లించాలి

ఖాజీపేట: ప్రధాని ఫసల్ బీమా యోజన ప్రీమియంను గతంలో వైఎస్ జగన్ ప్రభుత్వం చెల్లించేది.. కానీ నేడు కూటమి ప్రభుత్వం ఖరీఫ్‌లో చెల్లించలేదని రబీలో రైతులే చెల్లించాలని చెప్పడం రైతులను కూటమి ప్రభుత్వం వంచించడం కాదా అని ఏపీఎస్ ఆర్టీసీ కడప రీజనల్ మాజీ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి విమర్శించారు. దుంపలగట్టు గ్రామంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను కూటమి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందని అన్నారు. వర్షపాత నమోదును మండల కేంద్రంగా యూనిట్‌గా తీసుకుని నమోదు చేయడం జరుగుతోందన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద మాత్రమే వర్షపాత నమోదు పరికరం ఉందని, దీంతో మండల కేంద్రంలో వర్షం పడి ఇతర ప్రాంతాల్లో వర్షం పడకపోతే రైతులకు అన్యాయం జరుగుతోందని తెలియజేశారు. అందుకే సచివాలయ పరిధిని యూనిట్‌గా తీసుకుని వర్షపాతం నమోదు చేస్తేనే రైతులకు న్యాయం జరుగుతుందని సూచించారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో రైతులకు పెట్టుబడి కింద జూన్, జూలై నెలలలో రూ 13,500 రైతుల ఖాతాలకు జమచేసేవారని, కానీ కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద రూ.20వేలు ఇస్తామని చెప్పి నేటికి రైతులకు ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. తక్షణమే పెట్టుబడి కింద రైతులకు సహాయం అందించాలని డిమాండ్ చేశారు.

ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి కృషి చేయాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

ప్రొద్దుటూరు: ఉక్కు పరిశ్రమ నిర్మాణంపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత ఎందుకు మాట్లాడరని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ ప్రశ్నించారు. బుధవారం పట్టణంలో సీపీఎం పట్టణ కమిటీ 3వ మహా సభలు ముంతాజ్ బేగం, పక్కీరయ్య అధ్యక్షతన జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. కడప-బెంగళూరు రైల్వే లైన్ పూర్తి చేయాలని తెలిపారు. తెలుగుగంగ, గాలేరు-నగరి, హంద్రీ-నీవా, వెలిగొండ ప్రాజెక్టుల పరిధిలో పంట కాలువలు నిర్మించాలన్నారు. జిల్లాలోని అన్ని సాగు నీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కడప జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలన్నారు. కేసీ కెనాల్ పరివాహక ప్రాంతం 8 మండలాలు మినహా జిల్లా అంతటిని కరువు ప్రాంతంగా ప్రకటించి, కరువు సహాయక చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పులివెందుల మెడికల్ కళాశాలకు 50 ఎంబీబీఎస్ సీట్లను టీడీపీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. కడప కొప్పర్తి మెగా ఇండస్ట్రీయల్ హబ్‌కు మంజూరైన ఎంఎస్‌ఎంఈ టెక్నాలజీ సెంటర్ కమ్ టెస్టింగ్ ఫెసిలిటీని అమరావతికి తరలించడం దారుణమన్నారు. ప్రొద్దుటూరు పట్టణ సమగ్రాభివృద్ధికి ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి కృషి చేయాలని కోరారు. ముందుగా సీపీఎం జెండాను సీపీఎం సీనియర్ నాయకుడు పక్కీరయ్య ఆవిష్కరించారు. కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ మహాసభలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బి.మనోహర్, జిల్లా కమిటీ సభ్యులు వి.అన్వేష్, పట్టణ కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాలకార్మికుల నిర్మూలన అందరి బాధ్యత


అవగాహనా కార్యక్రమంలో మాట్లాడుతున్న మహిళా పోలీస్

ఖాజీపేట: బాలకార్మికుల నిర్మూలన అందరూ బాధ్యతగా తీసుకున్నప్పుడే సాధ్యమవుతుందని మహిళా పోలీస్ లీలావతి సూచించారు. ఖాజీపేటలోని బాలుర ఉన్నత పాఠశాలలో బాల కార్మికుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా వీధి బాలల కోసం డ్రైవ్ నిర్వహించారు. అనంతరం అవగాహనా కార్యక్రమం జరిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కల్గే నష్టాలను విద్యార్థులకు వివరించారు. బాల కార్మికులు ఎక్కడైనా పనిచేస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు. 1089 చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్‌ని అందరూ గుర్తు పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న పశువైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసప్రసాద్

ప్రొద్దుటూరు: విలువైన సమయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలని పశువైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. గోపవరం గ్రామ సమీపంలోని శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ పశువైద్య కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది కళాశాలలో 79 మంది విద్యార్థులు చేరారని తెలిపారు. వీరంతా పశువైద్యులుగా రాణించాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బాయ్స్ హాస్టల్ వార్డెన్ పి.విద్యాసాగర్, గర్ల్స్ హాస్టల్ వార్డెన్ డాక్టర్ పి.సుప్రియ, ఓఎస్‌ఏ డాక్టర్ పి.కళ్యాణి, ఓఏఎం డాక్టర్ కె.రాజాకిశోర్ పాల్గొన్నారు.

ఏరులై పారుతున్న మద్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

అట్లూరు: కూటమి ప్రభుత్వంలో మద్యం ఏరులై పారుతుందని తద్వారా హత్యాచారాలు హత్యలు అధికమయ్యాయని బద్వేలు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి తెలిపారు. బుధవారం పోరుమామిళ్లలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఊరూరా మద్యం షాపులు, బెల్టు షాపులు విస్తరించడంతో యువకులు మద్యంకు బానిసలవుతున్నారన్నారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు మద్యపాన నిషేధం అమలు చేస్తే.. అనంతరం చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయ్యాక మద్యపాన నిషేధం ఎత్తివేశారన్నారు. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక మద్యంషాపుల సంఖ్యను కుదించి బెల్టుషాపులు పూర్తిగా ఎత్తివేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పాత విధానానికి మంగళం పాడి తాగినోడికి తాగినంతా అన్నట్లు మద్యంషాపులను ప్రైవేటు పరం చేసి ఊరూరా బెల్టుషాపులు నెలకొల్పారన్నారు. దీంతో మహిళలపై అత్యాచారాలు, హత్యలు అధికమయ్యాయన్నారు. దీంతో మహిళలకు రక్షణ కరువైందన్నారు. అలాగే జగన్‌మోహన్‌రెడ్డి దిశా చట్టం అమలు చేసి మహిళలకు రక్షణ కవచంలా ఉండేలా చేస్తే.. కూటమి ప్రభుత్వం వచ్చాక దిశా చట్టంను తొలగించడంతో మహిళలపై అఘయిత్యాలు అధికమయ్యాయన్నారు. బద్వేలులో దస్తగిరమ్మ ఘటన, అలాగే చిత్తూరు జిల్లాలో మద్యం మత్తులో చిన్నారిపై అత్యాచారం ఆపై హత్య, అనంతపురంలో అత్తా కోడళ్లపై అత్యాచారం, ఇలా రాష్ట్రం అంతటా అత్యాచారాలు, హత్యలు అధికంగా జరిగాయన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నింటిని గాలికి వదిలారన్నారు.

పురుగు నుండి కాపాడే విత్తనశుద్ధి


విత్తనాలను అందుకున్న రైతులతో కేవీకే శాస్త్రవేత్తలు

మైదుకూరు: వేరుశనగలో విత్తనశుద్ధి చేసుకోవడం వల్ల నెల రోజులపాటు పురుగు నుండి కాపాడుకోవచ్చని మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ అన్నారు. సామూహిక ప్రథమ శ్రేణి ప్రదర్శనలో భాగంగా బుధవారం కేవీకేలో దువ్వూరు, బ్రహ్మంగారిమఠం మండలాలకు చెందిన రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ వేరుశనగలో విత్తన శుద్ధి ప్రాధాన్యత, విత్తన మోతాదు, నేల తయారీ, విత్తే దూరం, సమగ్ర పోషక యాజమాన్యం, కలుపు యాజమాన్యం గురించి వివరించారు. వేరుశనగలో అంతర పంటలు, ఎర పంటలను వేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా దువ్వూరు మండలం చిన్నసింగనపల్లె, నీలాపురం, మదిరేపల్లె, బ్రహ్మంగారిమఠం మండల పలుగురాళ్లపల్లె, సోమిరెడ్డిపల్లె గ్రామాలకు చెందిన 44 మంది రైతులకు ఒక ఎకరా సాగుకు వేరుశనగ 1812 రకం విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం కేవీకే అధిపతి డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ రైతులు పంటను సాగు చేసిన తర్వాత వారికి ఎప్పటికప్పుడు సలహాలు సూచనలు అందిస్తామని పేర్కొన్నారు.

ఘనంగా ఆరాధనా ఉత్సవాలు


అన్నప్రసాదం పంపిణీ చేస్తున్న వేదపాఠశాల విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక శ్రీకృష్ణగీతాశ్రమంలో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో నామా ఎరుకలయ్య, కమలాక్షమ్మ ఆరాధనా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం కమలాక్షమ్మ విగ్రహానికి, ఎరుకలయ్య, మళయాళస్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే కృష్ణ మందిరంలో వేణుగోపాల స్వామికి ప్రత్యేక పూజలు చేసి అలంకరించారు. గణపతిపూజ, కలశారాధన, భగవద్గీత పారాయణం తదితర పూజాకార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం 1000 మంది పైగా భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. కార్యక్రమంలో ఈఓ రామచంద్రాచార్యులు, శారదా జూనియర్ కళాశాల కరస్పాండెంట్ సురేష్‌బాబు రెడ్డి, విజయ్, జనార్ధనరెడ్డి, ఆశ్రమంలోని పలు విద్యాసంస్థల యాజమాన్యం, ప్రతినిధులు, శైవాగమ వేదపాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకాలను తగ్గించాలి


చాపాడు: చిన్నగురువలూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమం


మినుము పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

చాపాడు: వరి పైరులో రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని మండల వ్యవసాయాధికారి మ్యాగీ పేర్కొన్నారు. మండల పరిధిలోని చిన్నగురువలూరు, కుచ్చుపాప గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ వరిలో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని, వీటి వలన పంట దిగుబడుల్లో వ్యత్యాసాలు రావటంతోపాటు భూసారం తగ్గిపోతుందన్నారు. ఇదే క్రమంలో ప్రస్తుత పరిస్థితుల్లో వరి పంటల్లో ఆకుముడత, ఎర్రనల్లి తెగుళ్లు వ్యాపిస్తాయని తమ గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయ సిబ్బంది సలహాలు, సూచనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

సాగులో మెళకువలు పాటించాలి

ఖాజీపేట: రైతులు వ్యవసాయం సాగు చేసేటప్పుడు సాధారణ సాగు పద్ధతిలో కాకుండా శాస్త్రీయ పద్ధతిలో మెళకువలు పాటిస్తే మంచి దిగుబడి వస్తుందని ఏఓ నాగార్జున రైతులకు సూచించారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా కొత్తపేట, చెమ్ముళ్లపల్లె గ్రామాల్లో రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వరి పంట సాగు గురించి తెలుసుకుని అందులో మెళకువలను రైతులకు సూచించారు. తక్కువ ఖర్చుతో పంటలు ఎలా సాగు చేసుకోవాలని అందుకు కావాల్సిన సూచనలు రైతులకు అందించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సస్యరక్షణ పాటిస్తే అధిక దిగుబడులు

బి.కోడూరు: సస్యరక్షణ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి కౌశిక తెలిపారు. బుధవారం మండలంలోని ఐత్రంపేట, మున్నెల్లి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా వరి, మినుము పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ నూతన యాజమాన్య పద్ధతుల ద్వారా అధిక దిగుబడి పొందవచ్చని తెలిపారు. మినుము పంటలో పురుగు నివారణకు ఒక లీటరు నీటికి 2.5 ఎంఎల్ బారక్షైడ్ మందును పిచికారి చేయాలన్నారు. వరిపంటలో ఎక్కువగా కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలని, వ్యవసాయాధికారులు ఇచ్చే సూచనల మేరకు సస్యరక్షణ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ రాజశేఖర్, వీహెచ్‌ఏ దినేష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎగువ తంబళ్ళపల్లెలో పొలం పిలుస్తుంది

కలసపాడు: మండలంలోని ఎగువ తంబళ్ళపల్లెలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి జాకీర్‌షరీఫ్ రైతులకు మొక్కజొన్న పంటలో కత్తెరపురుగు యాజమాన్యం గురించి వివరించారు. మొక్కజొన్న విత్తన తొలిదశలో వేపనూనె 5 ఎంఎల్ ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయడం వలన తల్లి పురుగు గుడ్లు పెట్టకుండా నివారించవచ్చన్నారు. పురుగు చివరి దశలో అనగా పెద్దగా ఉన్నప్పుడు విషపు ఎరలు తయారు చేసి సుడులలో వేసుకోవాలన్నారు. విషపు ఎరలు తయారీ చేయుటకు 10 కిలోల తవుడు, 2 కిలోల బియ్యం 2 లేదా 3 లీటర్ల నీటిలో 24 గంటలు పులియబెట్టి అందులో 100 గ్రాములు థయోడికార్బ్ అనే మందును కలిపి ఉండలుగా చేసి మొక్కజొన్న సుడులలో వేయాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు మునికుమారి, ఐసీఆర్‌పీ లక్ష్మి పాల్గొన్నారు.

మురికినీటిని తొలగించండి


పాఠశాల ముందు నిల్వ ఉన్న మురికినీరు

గోపవరం: మండలంలోని బెడుసుపల్లె ప్రాథమిక పాఠశాలకు ఎదురుగా రోడ్డుపై నిల్వ ఉన్న మురికి నీటిని తొలగించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. గతంలో కురిసిన వర్షాలకు ఆర్‌అండ్‌బీ రోడ్డు కల్వర్టు దెబ్బతినడంతో తాత్కాలిక పనులు చేపట్టారు. రోడ్డు కన్నా కల్వర్టు ఎత్తుగా ఉండటంతో వర్షపునీరు, గ్రామంలోని ఎగువ ప్రాంతం నుండి వచ్చే నీరంతా పాఠశాల వద్ద చేరి నిలుస్తోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసనతో పాటు దోమల బెడద అధికంగా ఉంటోంది. ఇప్పటికైనా అధికారులు సమస్య పరిష్కరించాలని విద్యార్థులు, గ్రామస్తులు కోరుతున్నారు.